సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



బ్యాక్ టు హోమ్!

పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలను గ్రామస్థాయి అధికారులు (జీపీఎల్‌వో)గా నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది.

వివరాలు 8లో ▸



సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయినా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు 8లో ▸



ఉల్లి.. కల్పవల్లి

ఉల్లికి మార్కెట్‌లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. ధర తగ్గితే రైతులకు, పెరిగితే వినియోగదారులకు కన్నీళ్లు పెట్టిస్తోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేటి తరాన్ని ఉద్యమాలవైపు మళ్లిద్దాం

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాశ్‌రావు



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాశ్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): వందేళ్ల ఉద్యమ చరిత్రను నేటి తరానికి అందించి వారిని ఉద్యమం వైపు కార్యోన్ముఖుల్ని చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వి.ప్రకాశ్‌రావు పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంపై గురువారం పట్టణంలో నిర్వహించిన బహిరంగసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో వందేళ్ల సీపీఐ ప్రస్థానంలో నిత్యం పేదల పక్షాన నిలబడి ఎన్నో ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. నైజాం ప్రభుత్వం నుంచి దాదాపు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువజన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్, తాజోద్దిన్,షఫీ, మండల పట్టణ నాయకులు వినోద, శంకరప్ప, సాధిక్‌అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఆకాష్

- జిల్లా కన్వీనర్‌గా రాజు ఎన్నిక



జిల్లా కన్వీనర్ రాజు



రాజాపూర్ ఆకాష్

నారాయణఖేడ్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా రాజాపూర్ ఆకాష్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా రాజు ఎన్నికయ్యారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో వీరిని ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ నుంచి జిల్లా, రాష్ట్ర కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కడం పట్ల స్థానిక ఏబీవీపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: బాలసదనంలోని పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని బాలసదనం,శిశు గృహాలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పిల్లలకు చట్టాలపై అవగాహన కలిగి క్రమశిక్షణతో ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 244 మంది క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

సంగారెడ్డిజోన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 క్రీడల పోటీల్లో భాగంగా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు 244 క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా క్రీడల అధికారి ఖాసీంబాగ్ వెల్లడించారు. కిక్ బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడల్లో వీరు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

31 మంది అధ్యాపకులపై వేటు

- హైదరాబాద్‌లో రిపోర్టు చేయాలని గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆదేశం
- అందోల్ పాఠశాల ప్రిన్సిపాల్ తొలగింపు
- విద్యార్థినులు రోడ్డెక్కడంపై సర్కార్ సీరియస్
- తాత్కాలిక అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్

అందోల్ గురుకులంలో కలకలం

జోగిపేట(అందోల్): అందోల్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులన్నీ ఖాళీ అయిపోయాయి. పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ, పార్ట్‌టైం లెక్చరర్లను తొలగించడంపై విద్యార్థినులు పాఠశాల బయటకు వచ్చి ఈనెల 22, 23వ తేదీల్లో ఆందోళన చేపట్టిన విషయం విదితమే. దీంతో తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి వీఎస్ అలుగు వర్షిణి తనిఖీ చేశారు. విద్యార్థులు రోడ్డెక్కడాన్ని తీవ్రంగా పరిగణించిన సొసైటీ కార్యదర్శి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో గత ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక పార్ట్‌టైమ్ లెక్చరర్‌పై కేసులను కూడా నమోదు చేసిన విషయం తెలిసిందే. పాఠశాలలో పనిచేస్తున్న 18 మంది రెగ్యులర్ లెక్చరర్లు (ప్రిన్సిపాల్‌తో సహా) 13 మంది పార్ట్‌టైమ్ లెక్చరర్లను ఒకేసారి హైదరాబాద్‌లోని సొసైటీకి రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం విద్యార్థులకు బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో పార్ట్‌టైం అధ్యాపకులను నియమించేందుకు సొసైటీ చర్యలు తీసుకుంటుంది. దీంతో ఇంతకుముందు పాఠశాలలో పనిచేస్తోన్న రెగ్యులర్, పార్ట్‌టైమ్ లెక్చరర్లను వేరొక చోటికి బదిలీ చేయనున్నట్లుగా విశ్వసనీయ సమాచారం.

మహిళా ఉద్యోగులకే అవకాశం

అందోల్ గురుకుల పాఠశాలలో మగవారు ఎవ్వరూ పనిచేయకుండా అన్ని పోస్టుల్లోనూ మహిళలనే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. ఇంతకుముందు పనిచేసిన ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ గ్రేస్ స్థానంలో నారాయణఖేడ్ పాఠశాల ప్రిన్సిపాల్ లింగారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందిని నియమించేందుకు అందోల్‌లో పాఠశాలలో శుక్రవారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ పోస్టుల్లో చేరేందుకు మహిళలే రావాలని ప్రకటనలో పేర్కొనడం విశేషం.

ఆందోళన చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)



తాత్కాలిక అధ్యాపకుల నియామకం

అందోల్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న 18 రెగ్యులర్, 13 పార్ట్‌టైమ్ అధ్యాపకులను తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీకి రిపోర్టు చేశాం. రెగ్యులర్ పోస్టుల స్థానంలో పార్ట్‌టైమ్‌లను తీసుకుంటున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు జోగిపేటలో కాకుండా ఇతర చోట్ల పనిచేసేందుకు సిద్ధంగా ఉంటే అక్కడికి పంపుతాం. రెగ్యులర్ అధ్యాపకుల విషయంపై సొసైటీ కార్యదర్శి నిర్ణయం తీసుకుంటారు. – కె.నిర్మల, జోనల్ అధికారి (గురుకుల)

నేడు సింగూరుకు 'సేఫ్టీ' బృందం

- చీఫ్ డిజైన్స్ ఆర్గనైజేషన్ బృందం కూడా..
- రూ.133 కోట్లతో కాలువల లైనింగ్ పనుల నేపథ్యంలో..



సింగూరు ప్రాజెక్టు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నీటి పారుదల శాఖకు సంబంధించిన కీలక ఉన్నతాధికారుల బృందం నేడు సింగూరు ప్రాజెక్టును పరిశీలించనుంది. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువల ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో రెండు సాంకేతిక విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారుల బృందం రాక ప్రాధాన్యత సంతరించుకుంది. చీఫ్ డిజైన్స్ ఆర్గనైజేషన్ విభాగంతోపాటు, డ్యామ్ సేఫ్టీ ఉన్నతాధికారుల బృందం శుక్రవారం ఈ జలాశయాన్ని పరిశీలిస్తారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సాంకేతిక ఉన్నతాధికారుల బృందం డ్యామ్ భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలు, రివిట్‌మెంట్ పనులు ఎలా చేయాలనే దానిపై కీలక సూచనలు చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

రూ.133.89 కోట్లతో కాలువల లైనింగ్ పనులు..

ఉమ్మడి మెదక్ జిల్లాకు సాగు నీరు, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందిస్తున్న ఈ ప్రాజెక్టును నిర్మించిన నాటి నుంచి దీని కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టలేదు. దీంతో సాగునీటి వృథా అవుతోంది. మరోవైపు చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం ఇబ్బందిగా మారుతోంది. డిస్ట్రిబ్యూటరీలకు కూడా సిమెంట్ లైనింగ్ పనులు చేయకపోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సింగూరు కాలువల సిమెంట్ లైనింగ్ పనులు, డిస్ట్రిబ్యూటరీల పనులను చేపట్టింది. ఈ మేరకు రూ.133.89 కోట్ల పనులకు టెండర్లు పిలిచింది. ఈ పనులు చేసేందుకు ముందుకొచ్చే కాంట్రాక్టర్లు టెక్నికల్ బిడ్‌లను 2025 జనవరి 4న ఓపెన్ చేయనున్నారు. అలాగే ప్రైస్ బిడ్‌ను వచ్చేనెల 8న తెరువనున్నారు.

ఇవీ పనులు..

మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాజెక్టును నిర్మించినప్పటికీ, కాలువలకు లైనింగ్ పనులు వదిలేశారు. ఇప్పుడు మొత్తం 48 కి.మీల పొడవున్న ప్రధాన కాలువలకు సిమెంట్ సిమెంట్ లైనింగ్ పనులు చేయనున్నారు. రైట్ మెయిన్ కెనాల్ 12.5 కి.మీలు, మిగిలినవి లెఫ్ట్ మెయిన్ కెనాల్ – మెయిన్ బ్రాంచ్ కెనాల్‌లు, కలిపి మొత్తం 48 కి.మీ. పొడవుంటాయి. రైట్‌మెయిన్ కెనాల్ కింద కేవలం 2,500 ఎకరాల ఆయకట్టు ఉండగా, లెఫ్ట్‌మెయిన్ –మెయిన్‌బ్రాంచ్ కెనాల్‌ల కింద 37,500 ఎకరాల ఆయకట్టు ఉంది. మరో వైపు డిస్ట్రిబ్యూటరీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇప్పుడు ఈ పనులకు నీటి పారుదల శాఖ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం ప్రాజెక్టును పరిశీలించనుంది.

పనులకు 12 నెలలే గడువు..

కాలువల సిమెంట్ లైనింగ్ పనులు చేసేందుకు కేవలం 12 నెలలే గడువుగా నీటిపారుదలశాఖ నిర్ణయించింది. ఈ పనులు చేసేటప్పుడు కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని వదలడం కుదరదు. ఈ మేరకు ఈ ఆయకట్టుకు ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించింది.

కేవల్ కిషన్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్



కేవల్‌కిషన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేవల్ కిషన్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని, జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి కేవల్ కిషన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పేర్కొన్నారు. కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేకే భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ...కేవల్ కిషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించిన తొలితరం కమ్యూనిస్టు యోధుడన్నారు. మెదక్ ప్రాంతంలో అనేక గ్రామాలలో పేదలకు భూములు పంచిన నాయకుడని, తనకు వచ్చిన సొంత ఆస్తిలో నుంచి 200 ఎకరాల భూమిని పేదలకు పంచారని గుర్తు చేశారు. కిషన్ భూస్వాములకు వ్యతిరేకంగా పేదలకు భూములు పంచాలని మొట్టమొదట పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

దేశ కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం చేద్దాం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



వేదం-యజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, చిత్రంలో రచయిత నళినీ

గజ్వేల్‌రూరల్: దేశ కీర్తి, ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం గజ్వేల్ మండలం పిడిచెడ్‌లోని నిగమ నీడమ్–వేద గురుకులంలో మాజీ డీఎస్పీ, రచయిత డి.నళినీ ఆచార్యా సనాతన ధర్మంపై రచించిన 'వేదం–యజ్ఞం' అనే పుస్తకాన్ని వేదశ్రీ చిదానంద సరస్వతి స్వామితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ వేదం అందరు చదవడంతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ వేద గురుకులంను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాజీ డీఎస్పీ, రచయిత నళినీ ఆచార్య మాట్లాడుతూ సనాతన ధర్మానికి వేదం అనేది మూలం అని, వేదంలో ఏముందనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో వేదం చదవడంలేదన్నారు. అందరికీ తెలియజెప్పే సరళమైన భాషలో అర్థం చేసుకునేలా సనాతన ధర్మం 'వేదం–యజ్ఞం' అనే పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు.

ఎంవోయూలతో ఆర్థికవ్యవస్థ బలోపేతం



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ప్రతినిధులు

సంగారెడ్డి జోన్: విద్య, పారిశ్రామిక రంగాల్లో పరస్పర సహకారానికి హైదరాబాద్‌లోని ఐఐటీ–జపాన్‌లోని హమామత్సునగర మేయర్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు అవగాహన ఒప్పంద పత్రంపై కందిలోని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, జపాన్‌లోని హమామత్సు నగర మేయర్ యూసుకె నకనో గురువారం సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అవగాహన ఒప్పందాలు చేసుకోవడం ద్వారా ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు, ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతాయన్నారు. ఇరు దేశాల మధ్య మానవ వనరుల మార్పిడి, బహిర్గత ఆవిష్కరణల ద్వారా విద్యా, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. హమామత్సులో భారతీయుల సాంకేతిక నైపుణ్యాలను మరింత మెరుగుదిద్దేందుకు ఈ అవగాహన ఒప్పందం ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, మానవ వనరుల పరస్పర మార్పిడి, పారిశ్రామిక రంగాల్లో పరిశోధన–అభివృద్ధి వంటి కీలక అంశాల్లో ఐఐటీ హైదరాబాద్ పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ టెక్నాలజీ, అత్యుత్తమ ప్రతిభ పెంపొందించటంలో ఐఐటీ అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

జహీరాబాద్ టౌన్: రోడ్డు రవాణ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ విధుల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఆర్టీసీ ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ జాకీర్ హుస్సేన్ పలువురుకి ప్రశంసా పత్రాలతోపాటు నగదు బహుమతులను ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మొదటి బహుమతికి కింద రూ.800 నగదు, రెండో బహుమతిగా రూ. 600 నగదు, మూడవ బహుమతి కింద రూ.400 నగదు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ తిరుమలేశ్, డీసీ గంగమణి, ఏడీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.



నగదు అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్

పరిశ్రమల సహకారం అభినందనీయం



ఆర్వో ప్లాంట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యే గూడెం
- రుద్రారం గ్రామంలో రూ.1.68 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో రూ.1.68 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె దవాఖాన భవనం, మూడు ఆర్వో ప్లాంట్లను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.60 లక్షలు గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతీ పల్లె దవాఖానాలో వైద్యుడితోపాటు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామాభివృద్ధికి తోషిబా సంస్థ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్‌రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఏపీజీవీ సేవలకు బ్రేక్

వినియోగదారులకు బ్యాంకు అధికారుల వెల్లడి



బస్వాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బ్యాంకు అధికారులు

సంగారెడ్డి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు మారనున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి నెలాఖరువరకు బ్యాంకు సేవలకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు బ్యాంకు అధికారులు గురువారం మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే బ్యాంకు అధికారులు జిల్లాలో ఉన్న ఆయా బ్రాంచ్‌ల వారీగా గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంకు విధి విధానాలను వినియోగదారులకు తెలియజేస్తున్నారు. ఈ బ్యాంకు నుంచి నాలుగు రోజులపాటు యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొదలగు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండవని అధికారులు తెలిపారు. ఏదైనా అత్యవసర సమాచారం కోసం సమీప శాఖను వినియోగదారులు సందర్శించవచ్చని సూచించారు. అదేవిధంగా బ్యాంక్ సేవలు, ఖాతాలు ఇప్పటివరకు ఉన్న స్థానాల్లోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. వినియోగదారుల ఖాతా వివరాలు, ఖాతా నంబరు మారవని స్పష్టం చేశారు. వినియోగదారులు ఏపీజీవీబీ యూపీఐ నుంచి డి-రిజిస్టర్ చేసుకుని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో మళ్లీ రిజిస్టర్ అవ్వాలని వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు జారీ చేసిన డెబిట్ కార్డును ఉపయోగించి యూపీఐ కోసం మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. వి- మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్ అన్ ఇన్‌స్టాల్ చేసి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ వినియోగదారులు టీజీబీ ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలకోసం మళ్లీ నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

గట్టి చర్యలు వట్టి మాటలే!

మొద్దు నిద్రలో రెవెన్యూ యంత్రాంగం

- ప్రభుత్వ భూముల్ని కాపాడుకోవడంలో అలసత్వం
- కళ్లెదుటే కబ్జా...ఉలుకూపలుకూ లేని రెవెన్యూ శాఖ
- సుల్తాన్‌పూర్ కబ్జాదార్లపై చర్యలేవంటున్న స్థానికులు



సుల్తాన్‌పూర్ భూముల ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)



ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఇచ్చిన నోటీసులు

పటాన్‌చెరు: కళ్లెదుటే సర్కారు భూముల్ని అక్రమార్కులు కబ్జా చేస్తున్నా అమీన్పూర్ రెవెన్యూ అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడటం లేదు. కబ్జాదారులు చేస్తోన్న భూ దందాపై ఎవరైనా ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుని అక్రమార్కుల్ని వదిలి పెట్టేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని అలుసుగా తీసుకుని భూ కబ్జాలను యథేచ్ఛగా చేసుకుంటున్న అక్రమార్కులపై చర్యలేవని ఓ వైపు స్థానికులు నిలదీస్తున్నా అధికారుల నుంచి ఉలుకూపలుకూ లేదు. అందుకు సుల్తాన్‌పూర్ గ్రామపరిధిలో జరుగుతున్న అక్రమార్కుల భూకబ్జా, అమీన్‌పూర్ అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనంగా నిలుస్తోంది.

లే అవుట్ వేసి విక్రయిస్తున్నా...

సుల్తాన్పూర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 30లో కబ్జాదారులు పథకం ప్రకారం వంద ఎకరాల విస్తీర్ణంలో ఎత్తైన కొండలపై మట్టిపోసి జేసీబీలతో రోడ్లు వేసి లే అవుట్‌లు వేసి విక్రయిస్తున్నారు. అదేవిధంగా అమీన్పూర్ పట్టణం, మండల పరిధిలో అసైన్డ్, ప్రభుత్వ భూములే కాకుండా డీఆర్‌వో కస్టోడియన్ భూములు, చెరువు భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. ఇక బీరం గూడ గుట్ట పరిసరాల్లో సర్వే నంబర్ 993లో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని స్థానిక బిల్డర్లకు అమీన్పూర్ తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. అమీన్పూర్ పట్టణ మండల ప్రాంతాల్లో ఎకరా భూమి విలువ రూ.25 కోట్ల పైమాటే. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను రాజకీయ నాయకుల అండదండలతో కబ్జాలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇదే విషయం పత్రికల్లోనూ వచ్చి, సామాజిక మాధ్యమాల్లో కూడా బాగా వైరల్ కావడంతో రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి జేసీబీతో ఫెన్సింగ్ తొలగించి చేతులు దులుపుకున్నారే తప్ప అసలైన అక్రమార్కుల భరతం పట్టలేదు. సుల్తాన్పూర్ సర్వే నంబర్ 30 కబ్జాలపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి'ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకుంటాం

సుల్తాన్పూర్ భూ కబ్జా వ్యవహారంపై విచారణ జరుగుతోంది. అక్రమార్కులను గుర్తించి క్రిమినల్ కేసులు పెడతాం. అమీన్పూర్ ప్రభుత్వ భూములు కాపాడేందుకు చర్యలను తీసుకుంటాం.

– రవీందర్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

పరిశ్రమ వద్ద ఫ్లెక్సీల రభసా



చిరిగిపోయిన ఫ్లెక్సీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని వీఎస్టీ పరిశ్రమ వద్ద జరుగనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భాగంగా రెండు యూనియన్లు పోటాపోటీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. గురువారం పరిశ్రమ వద్ద ఉన్న ఎన్‌ఎస్ఆర్‌గ్రూప్ యూనియన్‌కు సంబంధించిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. దీంతో కార్మికుల మధ్య బ్యానర్ల పై రభస జరిగినట్లు కార్మికులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎన్‌ఎస్‌ఆర్ గ్రూప్ కార్మికులు పేర్కొన్నారు. తమ యూనియన్‌కు కార్మికుల మద్దతు లభిస్తుండటంతో కావాలనే కొంత మంది ఇలా చేశారని ఆరోపించారు.

జరిమానా, జైలు శిక్ష

జిన్నారం(పటాన్‌చెరు): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వారం రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురికి రూ.4,500 చొప్పున జరిమానా, మరొకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీల్లో గురుకులం విద్యార్థులు షాహిద్, ఎంపీ, రహీం, ఉమేర్, శైబాజ్‌లు ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. 27 నుంచి 31 వరకు ఖమ్మం, హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా ఆర్‌ఎస్‌సీ దీవం, ప్రిన్సిపాల్ జె.రాములు, కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, తదితరులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండపాక(గజ్వేల్): పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొండపాక మండలంలోని మర్పడ్గలో దుర్గా సాయి అక్రమంగా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడు. అలాగే దుకాణంలో అతడితోపాటు మరో ముగ్గురు పేకాట ఆడుతున్నారు. గురువారం నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, త్రీ టౌన్ పోలీసులు సంయుక్తగా దాడి చేసి దుర్గా సాయి, కోల కిష్టయ్య, తుప్పర్ల మహేశ్, కొడారి కనకయ్యను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,230 నగదు, సుమారు 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కూలీ అదృశ్యం

రామచంద్రాపురం (పటాన్ చెరు) : వలస కూలీ అదృశ్యమైన ఘటన గురువారం కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన సోమ మంగళ గాత్రే జీవనోపాధి కోసం తెల్లాపూర్ వలసొచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ నిర్మాణ సంస్థలో కూలీగా చేరాడు. 20న ఉదయం పనికి వెళ్లి తిరిగి లేబర్ షెడ్డుకు రాలేదు. అతడితో ఉండే సొంత గ్రామానికి చెందిన మిత్రుడు మోహన్ గ్రామానికి వెళ్లి ఉంటాడని భావించాడు. బుధవారం మిత్రుడు కూడా గ్రామానికి వెళ్లగా ఇంటికి రాలేదని తెలిసింది. వెంటనే అక్కడి పోలీసులను సంప్రదించాడు. మళ్లీ గురువారం సాయంత్రం తిరిగొచ్చి కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బ్యాక్ టు హోమ్!

రెవెన్యూశాఖలోకి పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలు

- 2022లో వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు 3,386 మంది బదలాయింపు
- సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలంటున్న పూర్వపు వీఆర్వోలు



సాక్షి, సిద్దిపేట : భూపరిపాలనలో సంస్కరణలో భాగంగా క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలను గ్రామ స్థాయి అధికారులు(వీఎల్‌వో)గా నియమించేందుకు కసరత్తును ప్రారంభించింది. పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలు వివిధ ప్రభుత్వ శాఖలకు 2022లో బదలాయించింది. తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారిని ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సర్క్యులర్‌ను జారీ చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ శాఖల్లో 3,386 మంది విధులు

భూ భారతి చట్టం-2024 అమలులో భాగంగా గ్రామ స్థాయిలో వీఎల్‌వోలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పని చేసిన వారిని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కలెక్టర్‌లకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ సర్క్యులర్‌ను జారీ చేశారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వీఆర్వో(గ్రామ రెవెన్యూ అధికారి)గా 550 మంది, వీఆర్ఏ(గ్రామ రెవెన్యూ సహాయకుడు)గా 2,836 మంది ఇలా మొత్తంగా 3,386 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్‌లు, ఆఫీస్ సబార్డినేట్, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులుగా బదలాయించడంతో విధులు నిర్వహిస్తున్నారు. వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న వారికి తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటారని కలెక్టరేట్ సిబ్బంది సమాచారంను అందిస్తున్నారు. అందుకోసం గూగుల్ ఫామ్‌ను పంపిస్తున్నారు.

వివిధ శాఖలకు బదలాయింపు అయిన వారు

జిల్లా	వీఆర్వోలు	వీఆర్ఏ
సిద్దిపేట	167	1,042
సంగారెడ్డి	231	989
మెదక్	152	805

ఈ మేరకు వారిలో ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. 28వతేదీ వరకు పూర్తి చేసి, వారి విద్యార్హతల ఆధారంగా విధానపరమైన నిర్ణయం తీసుకోనుంది.

సుముఖంగా ఉన్నప్పటికీ ..

వీఆర్వో, వీఆర్ఏ నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సుముఖంగా ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంను చాలా మంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాతృశాఖకు తిరిగి పంపేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కానీ తమ పాత సర్వీస్‌ను కలిపి మినిస్టీయల్ సర్వీస్ కింద తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయంతో తమ సర్వీస్‌ను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అర్హత ఉన్న వీఆర్వోలకు ప్రమోషన్ ఇవ్వాలని, క్లస్టర్ స్థాయిలో అదనపు ఆర్ఐ, జూనియర్ ఆర్ఐలుగా తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



భూ సమస్యల పరిష్కారం కొరకు తీసుకున్న భూభారతి చట్టానికి ఆహ్వానం పలుకుతున్నాం. ఈ చట్టాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా మళ్లీ మాతృశాఖకు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాం. అలాగే మా సర్వీస్, ప్రమోషన్‌ల గురించి సైతం ప్రభుత్వం నిర్ణయంను ప్రకటించాలి.

– ఆకుల రవీందర్, పూర్వపు వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు, సిద్దిపేట

సమాచారం అందిస్తున్నాం

వీఆర్వో, వీఆర్ఏ నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లోకి వెళ్లిన వారికి సమాచారంను అందిస్తున్నాం. మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి గూగుల్ ఫామ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. అందరూ 28వ తేదీ లోగా గూగుల్ ఫామ్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలి.

– అబ్దుల్ రహమాన్, ఏవో, కలెక్టరేట్, సిద్దిపేట

గాలిపటం ఎగుర వేయడానికి వెళ్లి..

- చెరువులో పడి బాలుడు మృతి
- ఇంటి నుంచి వెళ్లిన రెండు రోజులకు మృతదేహమై లభ్యం
- సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఘటన


తేజ కుమార్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: స్నేహితులతో కలిసి ఆడుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలుడు చెరువులో శవమై తేలిన ఘటన సిద్దిపేట జిల్లా పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు కథనం మేరకు.. అల్లెపు లింగం పద్మ దంపతులు పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. లింగం కుమారుడు తేజ కుమార్ (11) ఐదవ తరగతి చదువుతున్నాడు. 24వ తేదీన మధ్యాహ్నం తేజ కుమార్ స్నేహితులతో ఆడుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ బాలుడి ఇంటి చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో వెలికారు. బాలుడి స్నేహితులను ఆరా తీయగా పతంగి ఆడుకుంటూ వెళ్లాడని తెలిపారు. బీడీ కాలనీలోని మత్స్యవారి కుంట చెరువులో పతంగి కనిపించడంతో అనుమానంతో చెరువులో గాలించగా బాలుడి మృతదేహం లభ్యమైంది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని బయటకు తీయించి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

- ఫర్నిచర్ ధ్వంసం, లైన్‌మెన్‌కు గాయాలు
- ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం

రేగోడ్(మెదక్): ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయినా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ మండల కేంద్రమైన రేగోడ్‌లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మర్పల్లి గ్రామంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయి సుమారు ఐదు రోజులు గడుస్తున్నా లైన్‌మెన్ కిషన్‌నాయక్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ స్థానిక సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో లైన్‌మెన్ తలకు గాయమైంది. అనంతరం రైతులు భవనం పైకి ఎక్కి నిరసన తెలిపారు. సమస్య పరిష్కరించేంత వరకు దిగబోమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మల్లయ్య సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని రైతులను శాంతింపజేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఏఈ యాసిన్ అలీకి రైతులు వినతిపత్రాన్ని అందజేయగా ఏఈ సానుకూలంగా స్పందించారు.


భవనంపైకి ఎక్కి ఆందోళన చేస్తున్న రైతులు

టవేరా వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం

- మహిళ మృతి, మరో ముగ్గురికి గాయాలు
- ధ్యాన కేంద్రానికి వెళ్లొస్తుండగా కొండపాక గ్రామ శివారులో ఘటన


దెబ్బతిన్న టవేరా వాహనం

కొండపాక(గజ్వేల్): టవేరా వాహనాన్ని డీసీఎం ఢీకొట్టడంతో మహిళ చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా మంగళపల్లి గ్రామానికి చెందిన బట్ల లక్ష్మి, బట్ల సమీక్ష, దూస రమ, ఎలిగేటి మల్లేశం, ఎలిగేటి నీరజ, ఎలిగేటి శివాణి, మచ్చ నరేశ్, వెలమ సింధూజ(32) 24న రాత్రి టవేరా వాహనంలో రంగారెడ్డి జిల్లాలోని అస్మాన్ పల్లిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వెళ్లారు. ధ్యాన కేంద్రంలో పని ముగించుకొని 25న అర్ధరాత్రి మంగళపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. గురువారం తెల్లవారుజామున కొండపాక శివారులోని గాయత్రీ దేవాలయం సమీపంలో రాజీవ్ రహదారిపై మలుపు వద్దకు రాగానే హైద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టవేరా వాహనంలో ఉన్న సింధూజ, మచ్చ నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఎలిగేటి మల్లేశం, మచ్చ శివాణికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సింధూజ మృతి చెందింది. నరేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త సతీశ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కను తప్పించబోయి వృద్ధుడు..

తూప్రాన్: టీవీఎస్ ఎక్సెల్‌పై నుంచి పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై మాసాయిపేట స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం మేరకు.. మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి నడిమితండాకు చెందిన మాలోత్ మాంజ్యా(70) సొంత పనుల నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్‌పై తూప్రాన్‌కు బయలు దేరాడు. మాసాయిపేట స్టేషన్ సమీపంలోకి రాగానే రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించబోయి వాహనంపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి..


వెంకటి మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల చెక్ డ్యామ్‌లో నీట మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. హవేలీఘనపూర్ మండలం కూచన్ పల్లికి చెందిన కొజ్జా పురం వెంకటి (56) ఓ విందులో పాల్గొనడానికి ఏడుపాయలకు వచ్చాడు. స్నానం చేసేందుకు చెక్ డ్యామ్ లోకి దిగాడు. నీట మునిగి ఎంతకూ తేలకపోయేసరికి ఒడ్డున ఉన్న బంధువులు మిగితా వారికి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం



చోరీకి యత్నించిన ఏటీఎం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ బస్టాండ్ సమీపంలోని బిందు టిఫిన్ సెంటర్ పక్కన ఉన్న ఎస్‌బీహెచ్ ఏటీఎంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నగదు చోరీకి యత్నించినట్లు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు. సీసీ కెమెరాతోపాటు సెన్సార్‌ను ధ్వంసం చేశారన్నారు. పోలీసుల పెట్రోలింగ్ వాహనం సౌండ్ విని దుండగులు పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరు

చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమిస్తున్న పార్టీ సీపీఎం అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్కా రాములు అన్నారు. గురువారం పటాన్‌చెరులోని శ్రామిక్ భవన్‌లో టీఐడీసీ కార్మికుల తరపున రూ.12.06 లక్షలను రాములుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు, కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, టీఐడీసీ కార్మికులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, సుధాకర్ గౌడ్, జామి శ్రీను, భద్రం, శ్రీరాములు, వాసు, ప్రభాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ చుక్కారాములు

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్

- రూ.10 లక్షలు రికవరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్తయ్య గౌడ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

కొండాపూర్(సంగారెడ్డి): దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయడంతోపాటు సొత్తు రికవరీ చేసినట్లు డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. హైద్రాబాద్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ వాజిద్ 16వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్ పట్టణంలో ప్లాట్‌ను కొనుగోలు చేసేందుకు డ్రైవర్ మహ్మద్ అలీ ఖురేషి, మరో మిత్రుడితో కలిసి రూ.10 లక్షలు తీసుకొని కారులో బయలు దేరారు. డబ్బులు దొంగిలించాలని ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం డ్రైవర్ మహ్మద్ అలీ తన మిత్రులు అబ్దుల్ వహీద్, మహ్మద్ రహీం ఖాన్‌కు సమాచారం ఇచ్చాడు. మునిపల్లి మండలంలోని తాజ్ రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేసుకుందుకు కారు పార్క్ చేసి అబ్దుల్ వాజిద్, అతడి మిత్రుడు, డ్రైవర్‌లోనికి వెళ్లారు. మహ్మద్ అలీ కారును అన్‌లాక్ చేయగా అప్పటికే అక్కడికి చేరుకున్న అతడి మిత్రులు డబ్బులను తీసుకొని పరారయ్యారు. బాధితుడు మహ్మద్ వాజిద్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం హైద్రాబాద్‌లో అరెస్ట్ చేసి రూ.10 లక్షలు రికవరీ చేశారు. ఈ కేసును ఛేదించేందుకు కృషి చేసిన కొండాపూర్ సీఐ వెంకటేష్, మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్‌తోపాటు హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ హనీఫ్, పాండు, సునీల్‌కు రివార్డు అందించేందుకు ఎస్పీకి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

ఎస్ఐ సాయికుమార్ మృతితో..

స్వస్థలం కొల్చారంలో విషాదఛాయలు


సాయికుమార్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): కామారెడ్డి జిల్లా బిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న సాతెల్లి సాయికుమార్ మృతితో స్వస్థలమైన మండల కేంద్రంలో విషాదఛాయలు అలముకున్నాయి. గురువారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అడ్లూరు చెరువులో సాయికుమార్ మృతదేహమై తేలిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలియగానే గ్రామం నుంచి పెద్ద ఎత్తున గ్రామస్తులు, స్నేహితులు తరలివెళ్లారు. మండల కేంద్రానికి చెందిన శంకరమ్మ-ఆంజనేయులుకు సాయికుమార్ ఒక్కగానొక్క కుమారుడు. వీరిది వ్యవసాయ కుటుంబం. బీటెక్ పూర్తి చేసిన అతడు మొదటి ప్రయత్నంలోనే 2018 బ్యాచ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. ఉద్యోగంలో చేరిన మొదట్లో చిన్నకోడూర్, ఆ తర్వాత బీబీపేట్, ప్రస్తుతం బిక్కనూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు. రాత్రి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

దశ దినకర్మకు వెళ్లి వస్తుండగా..

ఆటో బోల్తా డ్రైవర్ మృతి


శ్రీకాంత్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి వర్గల్ మండలం గౌరారం శివారులో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం ఏఎస్ఐ రుక్కమ్మ కథనం మేరకు.. ములుగుకు చెందిన ధోరణాల శ్రీకాంత్(36) ఆటో డ్రైవర్. భార్య రజిత, ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం గజ్వేల్ మండలంలో బయ్యారంలో బంధువుల ఇంట్లో దశ దినకర్మకు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వెళ్లాడు. అదే రోజు రాత్రి ఒంటరిగా ఆటోనే ఇంటికి బయల్దేరాడు. గౌరారం సమీపంలో రాజీవ్‌రహదారిపై వాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మల్లన్న గుట్టెక్కేందుకు ఎన్ని కష్టాలో..

చెత్తాచెదారంతో టెంపుల్‌కు వెళ్లే దారులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో బీరంగూడ భ్రమరాంబ ఆలయం వెళ్లేందుకు భక్తులు ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుంది. ఆలయం వెళ్లేందుకు మొత్తం మూడు దారులు ఉన్నాయి. గుట్టకమాన్ (మధురానగర్) చౌరస్తా వైపు నుంచి రోడ్డు గోతుల మయంగా మారింది. ఈ రోడ్డుపై పాఠశాల సమీపంలో చెత్త కుప్పలు కనిపిస్తాయి. గుట్ట పక్కన ప్రభుత్వ భూమిలో మట్టిని డంప్ చేస్తున్నారు. అమీన్‌పూర్ వైపు నుంచి వచ్చే దారిలో ఆలయ భూమిలో చెత్తను పడేస్తున్నారు. ఈ రోడ్డు గుండా వచ్చే భక్తులు ముక్కు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. కేఎస్ఆర్ కాలనీ నుంచి గుట్టపైకి మెట్లు ఎక్కే దారిలో డ్రైన్ నిర్మాణ పనులతో రోడ్డు మొత్తం ఛిద్రమైంది. నిత్యం భక్తులు ఆ రోడ్డుపై నుంచి ప్రయాణం సాగించడం నరకప్రాయంగా మారింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్యలు వస్తున్నాయని భక్తులు వాపోతున్నారు.


ఆలయం వెళ్లే దారిలో ఇరువైపులా చెత్త

క్రిస్మస్ పండుగ వేళ విషాదం

- చర్చిలో ప్రార్థలనకు వెళ్లొస్తుండగా వాహనాన్ని ఢీకొట్టిన మరో వాహనం
- యువకుడు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ప్రజ్ఞాపూర్ ఔటర్ వద్ద ప్రమాదం

గజ్వేల్‌రూరల్: ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. మరో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రజ్ఞాపూర్‌లోని ఔటర్ రింగురోడ్డుపై చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన మందుల ప్రదీప్ బుధవారం టాటా ఏస్ ట్రాలీ వాహనంలో డ్రైవర్‌తోపాటు మరో 8 మంది పిల్లలతో కలిసి కుకునూర్‌పల్లి మండలం మేథినీపూర్ గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యాడు. అనంతరం తిరిగి వెళ్తూ మార్గ మధ్యలోని ప్రజ్ఞాపూర్ ఔటర్ రింగురోడ్డుపై ఉన్న బాబాయ్ హోటల్‌లో టీ తాగేందుకు వాహనాన్ని నిలిపారు. పిల్లలంతా హోటల్‌లోకి వెళ్లగా డ్రైవర్, ప్రదీప్ వాహనంలో ఉన్నారు. ఇదే సమయంలో అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన శివ గణేశ్ రెడ్డి టాటా ఏస్ వాహనంలో మిత్రుడు సాయికుమార్‌రెడ్డిని తీసుకొని హుస్నాబాద్‌లో కోడి పిల్లలను నింపుకొని బీదర్ వెళ్తున్నాడు. ప్రజ్ఞాపూర్‌లోని బాబాయ్ హోటల్ దగ్గరకు రాగానే ఆగి ఉన్న ప్రదీప్ టాటా ఏస్ వాహనాన్ని కోడి పిల్లల లోడ్‌తో వచ్చిన శివగణేశ్ రెడ్డి వాహనం ఢీకొట్టి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రదీప్‌కు,శివగణేశ్ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. గణేశ్ స్నేహితుడు సాయికుమార్ రెడ్డి(22)కి సైతం తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడో, రేపో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా..


సాయి కుమార్‌రెడ్డి మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్): స్నేహితుడు పిలిచాడని వెళ్లి రోడ్డు ప్రమాదంలో సాయి కుమార్ రెడ్డి మృతి చెందడంతో మండలంలోని రామవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన రెక్కల శ్రీలతకృష్ణారెడ్డి దంపతులకు ఇద్దరు సంతానం. అందులో చిన్న కుమారుడైన సాయికుమార్‌రెడ్డి బీటెక్ పూర్తి ఇటీవల హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. నేడో, రేపో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. గురువారం స్నేహితుడితో కలిసి టాటా ఏస్ వాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మృత్యురూపంలో కబళించింది.

శుభాకాంక్షలు చెప్పడానికి వెళ్తూ..


గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు సదాశివపేట మండల పరిధిలోని మెలిగిరిపేట గ్రామానికి చెందిన టేకూరి ప్రకాశ్(30) బైక్‌పై ఎక్కెపల్లికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారి బైపాస్ హిందువుల శ్మశాన వాటిక వద్ద వెనుక నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గావతి ఫిర్యాదు మేరకు సీఐ మహేశ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ గుంతలో పడి యువకుడు..

మరో ప్రమాదంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడి యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భూసనెల్లి సాయికుమార్(25) పట్టణంలో అద్దెకు ఉంటూ ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో రాత్రి డ్యూటీకి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రియదర్శినీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కనుంచి వెళ్తుండగా మట్టికుప్పలను ఢీకొని అదుపుతప్పి గుంతలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి భూసనెల్లి లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కరెంటు స్తంభానికి బైక్ ఢీకొని..
– యువకుడు మృతి, మరొకరికి గాయాలు


నవీన్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని పాతూరు శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన రాయలపురం నవీన్(21), స్నేహితుడు గణేశ్‌తో కలిసి బైక్‌పై మెదక్ వైపు వస్తున్నాడు. పాతూరు శివారులో స్తంభంను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణేశ్‌కు స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.